

మెరుగైన వైద్య సేవలు అందించాలి: సబ్ కలెక్టర్

పాలకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. శుక్రవారం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులను, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు రెఫర్ చేయకుండా పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని సూపరింటెండెంట్ చిరంజీవిని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో డాక్టర్ భారతి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

స్ఫూర్తి మంత్రం వందేమాతరం

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి
● వాడవాడలా ఘనంగా వేడుకలు



పార్వతీపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది మంది భారతీ యుల్లో స్ఫూర్తినింపిన గేయం 'వందేమాతరం' అని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దేశ ఔన్నత్యాన్ని పెంచే దిశగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పిలుపు నిచ్చారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమ కాంక్షను రగిల్చిన 'వందేమాతరం' గీతానికి శుక్రవారంతో 150 ఏళ్ల పూర్త యిన సందర్భంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో కలిసి వందేమాతరం గీతాలాపన చేశారు. శక్తివంతమైన గేయాన్ని రచించిన బంకించంద్ర చటర్జీకి నివాళి అర్పించారు. దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చిన గేయాన్ని స్మరిస్తూ ముందుకు సాగా లని, భారతమాతకు సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి


భక్తుల భద్రతకు ఏర్పాట్లు

దేవాలయాలకు వచ్చే భక్తుల భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్తీక సోమవారాల్లో శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దేవాలయాల్లో పరిశుభ్రత పాటించా లన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని ఏఐ ద్వారా భక్తులను లెక్కించొచ్చని తెలిపారు. వంద మందికి మించి భక్తులు హాజరైతే వలంటీర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలో వెళ్లేందుకు బార్‌కోడింగ్ అవసరమన్నారు. గర్భగుడి లోపల గేట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ మనీషారెడ్డి తదితరులున్నారు.

ట్రెక్కింగ్‌కు సిద్ధం చేయాలి

జిల్లాలో ట్రెక్కింగ్‌కు అనుకూలంగా ఉన్న ప్రాంతాలు, జలపాతాలు, వ్యూ పాయింట్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ట్రెక్కింగ్ ఏర్పాట్లపై గిరిజన యువతకు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' మన్యంలో ట్రెక్కింగ్‌కు దాదాపు 12 ప్రదేశాలు ఉన్నాయి. ముందుగా ఆరు ప్రాంతాలను సిద్ధం చేయాలి. శిక్షణ పొందుతున్న టూరిజం గైడ్లు పర్యాటకుల భద్రత చూసుకోవాలి. ' అని తెలిపారు. పర్యాటక ప్రాంతాలపై వెబ్‌సైట్ రూపొందించాలని డీఎఫ్‌వో ప్రసూనాను ఆదేశించారు. రాత్రివేళల్లో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. క్యాంప్ ఫైర్ వంటివి నిర్వహించాలని సూచించారు.

వందేమాతరం గొప్పదనం.. భావితరాలకు తెలియాలి 6లో



ఆకట్టుకున్న సీతంపేట గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

గురుకుల పాఠశాలకు అభినందనలు

● మంత్రి లోకేశ్ పేషీ నుంచి ప్రిన్సిపాల్‌కు ఫోన్

సీతంపేట రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాలకు మంత్రి నారా లోకేశ్ పేషీ నుంచి అభినందనలు అందాయి. వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో పాఠశాలలో సుమారు 500మంది గిరిజన విద్యార్థులు భారతదేశ చిత్రపటం, 150 అక్షరాకృతిలో కూర్చొని అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనను గుర్తించి ఫోన్ ద్వారా మంత్రి లోకేశ్ పేషీ అభినందనలు తెలిపినట్లు ప్రిన్సిపాల్ నీలంనాయుడు శుక్రవారం తెలిపారు. విద్యార్థులతో బాగా కార్యక్రమం నిర్వహించినందుకు ప్రత్యేకంగా ప్రశంసించారని వెల్లడించారు.

స్క్రీనింగ్‌తో క్యాన్సర్‌కు చెక్

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా శుక్రవారం జిల్లా ఆరోగ్య కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకర జీవనశైలి, క్యాన్సర్ రహిత నినాదాలతో పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్యకర జీవనశైలిని అలవాటు చేసుకోవాలని తెలిపారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్‌ను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. రోగుల్లో క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలను సత్వరమే గుర్తించి మెరుగైన వైద్య సేవలు అదించాలన్నారు. లక్ష్యాలు చేరుకునేలా సర్వే నిర్వహించా లని జిల్లా ఎన్‌సీడీ అధికారి టి.జగన్మోహన్‌రావు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐవో విజయ్‌మోహన్, ప్రోగ్రాం అధికారులు రఘుకుమార్, కౌశిక్, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో



చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఇంటర్ విద్య.. గాడిన పడేనా?

● కాంట్రాక్ట్ ఫ్యాకల్టీతోనే కొనసాగింపు
● తీవ్రంగా బోధనేతర సిబ్బంది కొరత
● పోస్టులు భర్తీ చేయని వైనం
● ఇదీ జూనియర్ కళాశాలల్లో పరిస్థితి
● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ప్రభుత్వం దృష్టిలో ఉంది



జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం.

- వై.నాగేశ్వరరావు, డీఐఈవో

జియ్యమ్మవలస, నవంబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిస్థితి దయనీయంగా మారింది. మౌలిక వసతులకు ఏ ఇబ్బందీ లేకపోయినా.. బోధన, బోధనేతర సిబ్బంది కొరత మాత్రం తీవ్రంగా ఉంది. ఏళ్లు గడుస్తున్నా ఆయా పోస్టులను మంజూరు చేయడం లేదు. దీంతో ఉన్న వారిపై పనిభారం అధికమవుతోంది. మరోవైపు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో లెక్చరర్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. జిల్లా పరిధిలోని సీతంపేట, గరుగుబిల్లి మండ లాల్లో మినహా మిగిలిన చోట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. పాలకొండ మండ లంలో మాత్రం బాలురు, బాలికలకు వేర్వేరుగా కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో 3,288 మంది బాలురు, 2,202 మంది బాలికలు విద్యనభ్య సిస్తున్నారు. మన్యంలో ఉన్న 14 ప్రభుత్వ జూని యర్ కళాశాలల్లో కాంట్రాక్టు ఫ్యాకల్టీ (సీఎఫ్) మొత్తం 140 మంది ఉండగా, రెగ్యులర్ లెక్చరర్లు కేవలం 27 మందే. వారితో పాటు గెస్ట్ ఫ్యాకల్టీ 12 మంది, ఒక ఎంటీఎస్ లెక్చరర్ ఉన్నారు. అయితే ఇంకా 12 లెక్చరర్ పోస్టులు ఖాళీ. చాలా ఏళ్లుగా కొనసాగుతున్న కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కొరవడింది.

బోధనా సిబ్బంది ఇలా..

పార్వతీపురం, పాలకొండ (బాలురు) జూనియర్ కళాశాలల్లో మాత్రమే ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ) పనిచేస్తున్నారు. బలిజిపేట, కొమరాడ, పార్వతీపురం, పాలకొండ (బాలురు), సాలూరులోని కళాశాలల్లో మాత్రమే రెగ్యులర్ లైబ్రేరియన్లు పనిచేస్తున్నారు. మిగిలిన తొమ్మిది చోట్ల ఈ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఎవరో ఒక లెక్చరరు ఆ బాధ్యతలు తీసుకోవాల్సి వస్తోంది. భామిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ సివిక్స్ హిస్టరీ లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చినమేరంగిలో సివిక్స్, వీరఘట్టంలో జువాలజీ, పాచిపెంటలో గణితం, పార్వతీపురం, పాలకొండ (బాలురు)లో తెలుగు లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బోధనేతర సిబ్బంది పరిస్థితి ఇదీ..

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనేతర సిబ్బంది పోస్టులకు గత పదిహేనేళ్లుగా భర్తీ చేయడం లేదు. కళాశాల సూపరింటెండెంట్, క్లాస్-4 ఉద్యోగులు ఎక్కడా లేదు. ఒక్కో కళాశాలకు ముగ్గురు ఆఫీసు సబార్డినేట్‌లు ఉండాలి. కానీ గుమ్మలక్ష్మీపురంలో ఒకరు మాత్రమే పని చేస్తున్నారు. రికార్డ్ అసిస్టెంట్లు కూడా ముగ్గురేసి ఉండాలి. అయితే 37 మందికి 16 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరు చోట్ల టైపిస్ట్ పోస్టులు మంజూరు లేదు. పార్వతీ పురంలో కళాశాలలో మాత్రమే ఒకరు పనిచేస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూని యర్ అసిస్టెంట్లు పరిస్థితి అదేవిధంగా ఉంది. ఆరు కళాశాలల్లో మాత్రమే సీనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. మిగిలిన ఎనిమిది కళాశాలల్లో ఈ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి.

శంబర పోలమాంబ ఆలయానికి ట్రస్ట్ బోర్డు 6లో

నేడు పాఠశాలలకు సెలవు లేదు: డీఈవో


సాలూరు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1578 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు నేడు (రెండో శనివారం) సెలవు లేదని డీఈవో బత్తుల రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 'మొంథా తుఫాన్ నేపథ్యంలో గత నెల 27, 28, 29 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వాటికి పరిహారంగా బదులకు ఈ నెల, డిసెంబరు 13, వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 రెండో శనివారాలను పనిదినాలుగా నిర్ణయించారు.' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి: ఎస్పీ 8లో

జట్టు ట్రస్టుతో గిరిజన రైతుల పురోగతి
ఏనుగుల హల్‌చల్
● పెదమేరంగి- రాజయ్యపేటలో సంచారం
6లో

మార్పు లేనట్టేనా?

● యథాతథంగానే మన్యం జిల్లా ఉంటుందా?
● నివేదిక రూపొందించిన జిల్లా పునర్ వ్యవస్థీకరణ ఉపసంఘం
● 10న మంత్రివర్గ సమావేశంలో రానున్న స్పష్టత



సాలూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటాయా? రెవెన్యూ డివిజన్‌ల్లోకి మండలాల చేరిక, తరలింపు ఏమైనా ఉంటుందా? అంటే.. దాదా పుగా ఆ అవకాశాల్లేవని తెలుస్తోంది. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జీవోఎం (మం త్రుల ఉపసంఘం) ఈ నెల 5న (బుధవారం) జరిగిన సమావేశంలో కొత్త జిల్లాలు, ప్రస్తుత జిల్లాల్లో సరిహద్దుల మార్పులు, చేర్పులపై చర్చించి నివేదిక తయారు చేసింది. ఈ నేపథ్యంలో మన్యం జిల్లాలో ఎటువంటి మార్పులు, చేర్పులు చేయనట్టు భోగట్టా. ఈ నెల 10న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై స్పష్టత రానుంది.

ప్రస్తుతం మన్యం జిల్లాలో సాలూరు నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలు ఉన్నాయి. మరో మండలం మెంటాడ విజయ నగరం జిల్లాలో ఉంది. కురుపాం నియోజకవర్గంలో జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలు పాలకొండ రెవిన్యూ డివిజన్‌లో ఉండగా కొమరాడ,

(మిగతా 8వ పేజీలో...)



అక్టోబరు 3 నుంచే జీతాలు

● మెగా డీఎస్సీ టీచర్లకు తీపికబురు

సాలూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ టీచర్లకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. గత నెల 3 నుంచే జీతాల చెల్లింపునకు ఆదే శాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్ర వారం డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ నేతల మోహనరావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో 578 మంది మెగా డీఎస్సీ టీచర్లు గత నెల 11 నుంచి విధుల్లో చేరారు. కాగా విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలసలో వారికి గత నెల 3 నుంచి 10 వరకు శిక్షణకు హాజరయ్యారు. అయితే శిక్షణ కార్యక్రమంలో వారు చేరినప్పటి నుంచే జీతాలు చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నూతన టీచర్లు హర్షం వ్యక్తం చేశారు.



ఎన్నాళ్లకెన్నాళ్లకు!

● పార్వతీపురం ఐటీడీఏలో పీజీఆర్ఎస్ ● వినతులు స్వీకరించిన ఇన్‌చార్జి పీవో ● గిరిజనుల హర్షం

పార్వతీపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆవిర్భావం తర్వాత పార్వతీపురం ఐటీడీఏలో మొట్టమొదటిసారిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటీడీఏ అధికారులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కురుపాం కేంద్రంగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని , గిరిజన గర్భిణుల వసతిగృహంలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. భూ సమస్యలు పరిష్కరించాలని మరి కొందరు గిరిజనులు అర్జీలు అందించారు. పాచిపెంట మండలం శతాబి గ్రామానికి చెందిన శిలపజన్ని హారీష్ తండ్రి శ్రీరాములు వినతిప త్రాన్ని అందిస్తూ తన కుమారుడు శిలపజన్ని హరోణ్‌కు కళ్లు కనిపించడం లేదని, ఆపరేషన్‌కు రూ.1,80,000 అవసరం అవుతుందని తండ్రి శ్రీరాములు తెలిపారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి పీవో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఆపరేషన్ చేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతిని ఆదేశించారు. దీంతో ఈ నెల 14న ఆపరేషన్‌కు తేదీ ఖరారు చేశారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీవో మురళీధర్, గిరిజన ఇంజనీరింగ్ అధికారి మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పట్లో ఇలా..

జిల్లా ఏర్పాటు కాకముందు ప్రతి సోమవారం పార్వతీపురం ఐటీడీఏలో గ్రీవెన్స్ నిర్వహించే వారు. జిల్లా ఆవిర్భావం తర్వాత కొన్ని రోజులు ఏపీవో లేదా ఆ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. అయితే కొన్ని వారాల తర్వాత

(మిగతా 8వ పేజీలో...)



ఐటీడీఏ పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల సమస్యలు వింటున్న ఇన్‌చార్జి పీవో తదితరులు

వందేమాతరం గొప్పదనం

భావితరాలకు తెలియాలి

● 150 ఏళ్లు పూర్తికావడంతో మానవహారాలు, ర్యాలీలు

వందేమాతరం గొప్పదనం భావితరాలకు తెలియాలని, ఆ గీతం స్వాతంత్ర సమరానికి స్ఫూర్తిగా నిలిచిందని వక్తలు తెలిపారు. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తిచేసుకోడంతో శుక్రవారం జిల్లావ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. పాఠశాలల్లో గీతాన్ని ఆలపించారు.


పాలకొండ: నగర పంచాయతీ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన


జిల్లా పోలీస్ కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి


చీపురుపల్లి: మూడు రోడ్ల కూడలిలో మానవహారం


సాలూరు: ప్రభుత్వ పాఠశాలలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


భోగాపురం: పోలిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు


సాలూరు రూరల్: పాచిపెంట మండలం కొత్తవలస ఉన్నత పాఠశాలలో అంకెల రూపం


కురుపాం: కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో వందే మాతరం గీతం ఆలపిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


పాలకొండ: పోలీస్‌స్టేషన్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న దృశ్యం


గరుగుబిల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గీతాలాపన చేస్తున్న ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి

కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలి

● రైతుకు సుస్థిరమైన లాభం వచ్చేలా కృషి చేయాలి
● ప్రతి నియోజకవర్గంలో 'ఒక నగర వనం' అభివృద్ధి చేయాలి
● కలెక్టర్ రామసుందర్ రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల సాగుపై దృష్టిసారించాలని కలెక్టరు రామసుందర్ రెడ్డి కోరారు. జిల్లాలో సీజనల్‌గా డిమాండ్ ఉన్నటువంటి పూలతోటల పెంపకం, అరటి తోటలు, బొప్పాయి, పుట్టగొడుగు, ఆకు కూరలు తదితర పంటలు విస్తీర్ణాన్ని పెంచడంపై ఉద్యాన అధికారులు దృష్టిసారించాలని తెలిపారు. రైతుకు సుస్థిరమైన లాభం వచ్చేలా కృషి చేయాలని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉద్యాన, పశుసంవర్ధక, అటవీ, ఏపీఎంఐపీ శాఖలపై సమీక్షించారు. కలెక్టరు మాట్లాడుతూ ప్రతి మండలంలో కనీసం 500 ఎకరాల్లో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయాలన్నారు. విశాఖ, అనకాపల్లి వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా విజయనగరంపై కూరగాయలు డిమాండ్ అధికంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్ పామ్, కోకో సాగుపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా జిల్లాలో మూడు వేల హెక్టార్లు లక్ష్యంగా చేసుకోవడం జరిగిందని, వచ్చే మార్చి నాటికి 823 హెక్టారలో యూనిట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. పశుగ్రాసాన్ని పెంచడం ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 1425 గోకులాలు మంజూరు కాగా 521 పూర్తయ్యాయని, మిగిలిన వాటికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జిల్లాలో గ్రీన్ కవర్ శాతం 2029 నాటికి 37 శాతాన్ని పెంచడానికి లైన్ డిపార్ట్‌మెంట్ల సహకారం తీసుకోవాలని అటవీ శాఖ అధికారికి ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక నగరవనం అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ప్రతి రోజు మండలంలో కనీసం వెయ్యి మందికి తక్కువ కాకుండా ఉపాధి పనులను కల్పించాలని ఆదేశించారు. ఎన్‌ఆర్‌జీఎస్ పథకంపై ఆయా శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ ఉపాధి హామీ పనుల్లో వేగాన్ని పెంచాలని,పనిలో పాల్గొనే వేతనదారులు సంఖ్యను గణనీయంగా పెంచాలని కోరారు. ప్రగతి తక్కువ ప్రగతి ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వందరోజుల పనికల్పనలో వెనుకబడి ఉన్న మండలాలపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. వచ్చే వారం నాటికి కనీసం 20 శాతం పనులపై మొదలు పెట్టాలని ఆదేశించారు. ఈ వారంతానికి ఈ-కైవైసీ పనులు 95 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

బినామీ మత్స్యకార పింఛన్లు నిలిపివేత

● మంజూరు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉణుకూరు గ్రామస్థులు

వంగర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండలంలోని ఊణుకూరుకు చెందిన పలువురు మడ్డువలస రిజర్వాయర్‌లో మత్స్యకారులుగా తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి పొందుతున్న పింఛన్లను నిలిపివేశారు. ఇటీవల ఊణుకూరుకు చెందిన గేదెల బాలమురళి, విశ్వనాథ్‌లు తమ గ్రామంలో కొందరు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి మత్స్యకార పింఛన్లు పొందుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.దీంతో కలెక్టర్ దర్యాప్తునకు ఆదేశించారు.ఈ నేపథ్యంలో గతనెల 13న డీఆర్‌డీఏ అధికారులతోపాటు రేగిడి ఎంపీడీవో శ్యామలకుమారి దర్యాప్తు చేశారు.ఈ మేరకు ఎనిమిది మంది తప్పుడు పత్రాలతో మత్స్యకార పింఛన్లు పొందుతున్నట్లు గుర్తించారు. నివేదికలు జిల్లా అధికారులకు అందచేయడంతో శుక్రవారం ఆ పింఛన్లు నిలిపివేసినట్లు ఎంపీడీవో తెలిపారు. అయితే ఊణుకూరుకు చెందిన వారిని మత్స్యకారులుగా ఎలా గుర్తించారని, సిఫారసుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం వంగర తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తమకు సభ్యత్వం, పార్టీపేరుతో గత ప్రభుత్వం ఇవ్వలేదని, బినామీలకే అవకాశం కల్పించిందని గంగుళ, సింహలతో పాటు పలువురు ఫిర్యాదు చేశారు. 12న జరగాల్సిన మడ్డువలస మత్స్యకార సొసైటీ ఎన్నికలు నిలిపివేయాలని, తమకు సభ్యత్వం కల్పించిన అనంతరం ఎన్నికలు జరపాలని వారు కోరారు. కాగా గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఊణుకూరులో దర్యాప్తు చేయడం వాస్తవమేనని,పింఛన్ మంజూరు విషయం తమకి తెలియదని మడ్డువలస మత్స్యశాఖ ఎఫ్‌డీవో ప్రసాద్ తెలిపారు.

పాత నేరస్థులకు కౌన్సెలింగ్ చేయండి

● జీఆర్పీ డీఎస్పీ రామచంద్రరావు


రైల్వేస్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రామచంద్రరావు

విజయనగరంక్రైమ్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, దొంగతనాలపై కఠినంగా వ్యవహరించాలని జీఆర్పీ డీఎస్పీ రామచంద్రరావు ఆదేశించారు. పాత నేరస్థులపై నిఘా పెట్టి స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. శుక్రవారం వార్షిక తనిఖీల్లో భాగంగా విజయనగరం జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలోనూ, రైల్వే ప్లాట్‌ఫారాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గంజాయి ఇతర రాష్ట్రలకు తరలించే ముఠాలపై ఈగల్‌టీం, లోకల్ పోలీస్, ఆర్పీఎఫ్ సిబ్బందితో దాడులు నిర్వహించి గంజాయి రవాణాను అడ్డుకోవా లన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐ బాలాజీరావు సిబ్బంది పాల్గొన్నారు.

అరిగిపాలెంలో సన్నిధానం పూజ

వేపాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరిగిపాలెంలో అయ్యప్ప స్వాములు గురువారం రాత్రి సన్నిధానం పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి లట్టాల మణి స్వామి, అరిగిపాలెం గురుస్వామి దములూరి రామారావు తదితరుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ పూజలో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన పదివేల మంది అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాములు శరణు గోషతో అరిగిపాలెం పులకించి పోయింది.


పూజలో పాల్గొన్న అయ్యప్పలు

అంబాడ వీఏఏకు షోకాజ్ నోటీసు

రేగిడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న అంబాడ రైతుసేవాకేంద్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్(వీఏఏ) బి.ప్రశాంత్‌కు షోకాజ్ నోటీష్ జారీ చేసినట్లు ఏవో శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఇటీవల ఆయన రైతుసేవ కేంద్రంలో అందుబాటు లేకపోవడం, శాఖపరమైన పనుల్లో బాధ్యతారహితంగా వ్యవహరించడంపై రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పలుమార్లు మందలించినా ఎటువంటి మార్పు రాలేదని ఏవో తెలిపారు. ఈ విషయంపై గ్రామంలో విచారించి షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు ఏవో తెలిపారు.


చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

క్రీడల్లో ప్రతిభను చాటండి

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ● ఉత్సాహంగా అంతర జిల్లాల చదరంగం పోటీలు ప్రారంభం

సీతానగరం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో పాటు అన్ని క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభను చాటాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జోగింపేట గిరిజన సంక్షేమ వసతి పాఠశాలలో అండర్-14, 17, 19 విభాగాల అంతర జిల్లాల చదరంగం చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి చదరంగం పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో గెలుపొందిన విజేతలు జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. జాతీయ స్థాయిలో క్రీడాకారులు గెలుపొంది రాష్ట్రానికి మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మరింత పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

జట్టు ట్రస్టుతో గిరిజన రైతుల పురోగతి

● నాబార్డు రీజనల్ జనరల్ మేనేజర్ మహేష్ ప్రాడ్‌సింగ్


గిరిజనుల ఉత్పత్తులను పరిశీలిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జట్టు ట్రస్టు ద్వారా గిరిజన రైతుల పురోగతి సాధ్యమని నాబార్డు రీజనల్ కార్యాలయ జనరల్ మేనేజర్ మహేష్ ప్రాడ్‌సింగ్ అన్నారు. గొరడ కేంద్రంగా నాబార్డు సహకారంతో నిర్వహిస్తున్న జీవ ప్రాజెక్టును శుక్రవారం ఐఫాడ్ సభ్యులు, మలావి దేశానికి చెందిన మలావి అగ్రికల్చర్ అండ్ ఇండస్ట్రీయల్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ బృందం సందర్శించింది. జట్టు ట్రస్టు తోటపల్లిలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు, వ్యవసాయ ఉత్పాదకాలు జీవన ఉత్ప్రేరకాలు సందర్శించి ప్రశంసించారు. పెంగవ గ్రామంలో పువ్వల ఈలెమ్మ, దివాకర్, మండంగి కమలకుమారి, మండంగి లలిత, కృష్ణారావు తదితరులు రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం గొరడలో జీవ రైతులు, ఎఫ్‌పీసీ సభ్యులు, మహిళా సంఘ ప్రతినిధులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఐఫాడ్ నుంచి మహమ్మద్ ఆలీ, అలెజాండ్రో ఎంకిసో, తియర్రిలా త్రేయల్లే, మాలావి నుంచి ప్లస్ ములేకనో, పీటర్ చిపేట, థామ్సన్ కుంవెండ, లోటిన్యాసులు, నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రేఖ గోనల్, పార్వతీపురం మన్యం జిల్లా నాబార్డు డీడీఎం సాధు దినేష్‌కుమార్ రెడ్డి, జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు పారినాయుడు, జట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహారాజ్, జీవ కమిటీ చైర్మన్ తాడంగి జమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శంబర పోలమాంబ ఆలయానికి ట్రస్ట్ బోర్డు

● ఉత్తర్వుల ప్రతిని విడుదల చేసిన మంత్రి సంధ్యారాణి ● 13న ప్రమాణ స్వీకారం చేసే అవకాశం?


జీవో ప్రతిని అందజేస్తున్న రాష్ట్ర మంత్రి సంధ్యారాణి


శంబర పోలమాంబ

మక్కువ రూరల్/సాలూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ ఆలయానికి ట్రస్ట్ బోర్డు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర దేవాదయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల కాపీని గురువారం సాయంత్రం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్థానికంగా విడుదల చేశారు. ఈ ఏడాది జనవరిలో 10 మంది సభ్యులతో కూడిన ఉత్సవ కమిటీని నియమించగా పోలమాంబకు 10 వారాల ఉత్సవాలు నిర్వహించిన అనంతరం కమిటీ కాల పరిమితి ముగిసింది. దాంతో రెండేళ్ల కాల వ్యవధిలో ట్రస్ట్ బోర్డును నియమించేందుకు దేవాదయ శాఖ చర్యలు చేపట్టింది. నైదాన చిన్న తిరుపతి, తీళ్ల సింహాచలం, అక్యాన సింహాచలం, గొట్టాపు భవాని, ఆవాల వెంకటేష్, వెలగాడ నారాయణమ్మ, సొన్నాయిల సత్యవతమ్మ, గొల్లపల్లి లలితకుమారి, చీకటి ద్రాక్షరాణి, వంజరాపు రాములను సభ్యులుగా ఖరారు చూస్తూ ఆ శాఖ కమీషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు చేశారు. అయితే 13న ఆయల ట్రస్టీ బోర్డు ప్రమాణ స్వీ కారోత్సవాన్ని చేపట్టే అవకాశం ఉందని సమాచారం. ఆ సమయంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎవరన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అదేరోజు శంబర పోలమాంబ ఆలయం ఈవో ట్రస్ట్ బోర్డుతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

పెదమేరంగి - రాజయ్యపేట మధ్యలో ఏనుగులు

● అరటి, వరి, చెరకు పంటల ధ్వంసం

జియ్యమ్మవలస, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పెదమేరంగి, చింతల బెలగాం పంచాయతీ రాజయ్యపేట గ్రామాల మధ్య ఏనుగులు సంచరిస్తున్నాయి. అక్కడ అరటి, వరి, చెరకు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి మరింత నష్టం చేసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏనుగులను ఒడిశా రాష్ట్రానికి తరలించడం గాని, పునరావాస కేంద్రానికి పంపించడం గాని చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.


పెదమేరంగి సమీపంలో మామిడి తోటలో సంచరిస్తున్న ఏనుగులు

నిర్వహణ లేక రోడ్డుపై మురుగు నీరు

● పాదచారులు, వాహనచోదకులకు అగచాట్లు ● ఇదీ భోగాపురం మండలంలోని జాతీయరహదారి-16పై సర్వీసు రోడ్డులో పరిస్థితి

భోగాపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాయివలస,మహారాజుపేట, భోగాపురం తదితర చోట్ల జాతీయరహదారి-16 నిర్వహణ లోపం పుణ్యమాని రోడ్డుపై మురుగునీరుచేరుతోంది. రోడ్డునిర్మాణంలో భాగంగా గ్రామాలకు ఇరువైపుల సర్వీస్ రహదారుల పక్కనే హైవే అధికారులు కాలువలు నిర్మించి వాటిపై కాంక్రీట్‌పలకలు కూడా ఏర్పాటుచేశారు.దీంతో రహదారులకు ఇరువైపుల గల వాడుక, వర్షం నీరు కాలువల్లో చేరుతుంది. వాడుక, వర్షం నీటితో కలిసి చెత్త కూడా హైవేకాలువల్లోకి చేరడంతో హైవే కాలువలు పూర్తిగా పూడికలతో నిండిపోయాయి.ఎప్పుడు వర్షం కురిసినా హైవేకాలువల్లోకి నీరు చేరడంతో అప్పటికే కాలువలుపూడికలతో నిండిపోవడం వల్ల పూడికతో కూడిన మురుగు నీరు సర్వీస్ రహదారిపైనుంచి ప్రవహిస్తోంది. ఈనేపథ్యంలో ఆయా గ్రామాల వద్ద స్థానికులు తప్పనిసరి పరిస్థితుల్లో హైవే కాలువల్లో పూడికలు తొలగించి నీరు బయటకు రాకుండా చర్యలు చేపడుతున్నారు. అయితే హైవే అధికారులు సర్వీస్‌రహదారులకు ఇరువైపులకాలువలు నిర్మించారేగాని వాటిల్లో పూడికలు తొలగించడం, నీరు ప్రవహించి పోయే విధంగా చెత్త తొలగించడం వంటి చర్యలు చేపట్టడంలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబందించిన ఎన్‌హెచ్-16 నిర్వాహణ అధికారులు స్పందించి గ్రామ సమీప జాతీయరహదారులను ఆనుకొని ఉన్న కాలువల నిర్వహణపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



భోగాపురం వద్ద ఎన్‌హెచ్ -16పై కాలువ నిండి పోవడంతో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

దైవదర్శనానికి వెళ్తుండగా..

● ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న వైనం

● భర్త కళ్ల ఎదుటే భార్య మృతి



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న సంగంనాయుడు

గరివిడి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గదబవలస పంచాయతీకి పరిధిలోగల చినఐతంవలస ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త కళ్లెదుటే భార్య మృతి చెందింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తెర్లాం మండలం పెరుమాళికి చెందిన వరగంజి శ్రీలత(55), ఆమె భర్త సంగంనాయుడులు పెరుమాళి నుంచి చీపురుపల్లి మండలంలోని పుర్రేయ్యవలసలో గల మానసాదేవి అమ్మవారి దర్శనానికి స్కూటీ మీద వెళ్తున్నారు. అదే సమయంలో చీపురుపల్లి నుంచి మెరకముడిదాం వెళ్తున్న ఆర్టీసీ బస్సు చినఐతంవలస మలుపు వద్ద ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక భాగంలో కూర్చొన్న శ్రీలత అక్కడికక్కడే మృతిచెందగా భర్త సంగంనాయుడుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి సంగంనాయుడును తరలించారు. తన కళ్లెదుటే భార్య మృతిచెందడంతో భర్త సంగంనాయుడు రోదించాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంగంనాయుడు రాజాంలోని ఓ ప్రైవేటు సుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నాడు. స్కూటీపై ఇటీవలే కొనుగోలు చేశాఉ. గరివిడి ఎస్‌ఐ లోకేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

తగరపువలసలో రాజాం యువకుడు..

రాజాం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తగరపువలస వద్ద శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో రాజాంకు చెందిన యువకుడు మృతిచెందాడు. పట్టణంలోని చిన్న చెరువుగట్టుకి చెందిన జంపా అచ్యుతరావు (32) తగరపువలసలోని ఓ స్వీట్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. తగరపువలసలో రోడ్డు దాటుతుండగా ఓ పాఠశాల బస్ ఢీకొనడంతో బస్సుకు, డివైడర్‌కు మధ్య ఉండిపోవడంతో తీవ్ర గాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో రాజాంలోని చినచెరువుగట్టుపై విషాద ఛాయలు అలముకున్నాయి.

మందులకు వెళ్లి వస్తుండగా..

కొమరాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన కదా అనసూయ (75) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మందుల కోసం పార్వతీపురం వెళ్లి తిరుగు ప్రయాణంలో సమీప బంధువువాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఆర్డీవో కార్యాయానికి చేరువలో స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ నియంత్రణ కోల్పోడంతో వెనుక కూర్చొన్న అనసూయ జారిపడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. మృతురాలి కుమార్తె వనజాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కె.నీలకంఠం తెలిపారు.

కంకర తవ్వకాలపై నిఘా



కంకర తవ్వకాలతో పాడైన రక్షిత పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేగిడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కంకర తవ్వకాలపై పూర్తిస్థాయిలో నిఘాపెడతామని, పోలీసులకు సమాచారం ఇచ్చి రాత్రివేళల్లో కాపలాపెడతామని తహసీల్దార్ కృష్ణలత తెలిపారు. గుళ్లపాడు రెవెన్యూలో ఉంగరామెట్ట కొండ నుంచి అక్రమంగా కంకర తవ్వకాల నియంత్రణపై సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈనెల 6న ఆంధ్రజ్యోతిలో కొండను తొలిచి... కంకర తరలించి శీర్షికతోకథనం ప్రచురితంకావడంతో కృష్ణలత స్పందించారు. కంకర తవ్వుతున్న ప్రదేశాన్ని వీఆర్వో రామకృష్ణతో పరిశీలించారు. అక్కడ ఉన్న రాజాం మునిసిపాలిటికీ చెందిన రక్షిత పైప్‌లైన్‌పాడవడంతో తాగునీరు వృథాగా పోవడాన్ని గమనించారు. దీంతో ఆమె రాజాం మునిసిపాలిటీ సిబ్బందిని అప్రమత్తం చేయగా, వారు మరమ్మతులు చేపట్టారు. శనివారానికి లీక్‌లు పూర్తిగా అరికడతామని తహసీల్దార్ తెలిపారు.

వినతులు తక్షణమే పరిష్కరించాలి

● శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



అర్జీదారునితో మాట్లాడుతున్న లలితకుమారి

శృంగవరపుకోట , నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ప్రజల నుంచి అందిన వినతులుతక్షణమే పరిష్కరించాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదేశించారు. శుక్రవారం వేపాడ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారం జరిగే వరకు అధికారులు పర్యవేక్షించాలని కోరారు. భూ, విద్యుత్ సమస్యలు, గృహనిర్మాణాలు, రోడ్లు, ఇరిగేషన్,హెల్త్ ఆరోగ్యం, పెన్షన్లు, ఉపాధి నిధులు, వ్యవసాయ సమస్యలపై 200కి పైగా ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలోతహసీల్దార్ జె.రాములమ్మ,ఎంపీడీవో సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కోట్యాడ రమణమూర్తి పోతల వెంక టరమణ, లక్ష్మి, భారతి, దేముడునాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు



వినతిపత్రం స్వీకరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు తెలిపారు. శుక్రవారం పోలిపల్లిలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా భూసమస్యలు, ఎయిర్‌పోర్టు నిర్వాసితుల ఫిర్యాదులు, సీసీరోడ్లు, కాలువలు, విద్యుత్ సమస్యలపై ప్రజలు వినతులు అందజేశారు.

మత్స్యకారులు అభివృద్ధి చెందేలా చర్యలు

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయనున్నట్లు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకంనాగమాధవి తెలిపారు. ముంజేరు క్యాంపుకార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి చెందెలా చర్యలు తీసుకో వడం జరుగుతుందన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి



అదితిగజపతిరాజుతో మాట్లాడుతున్న ఐక్యవేదిక నాయకులు

విజయనగరం దాసన్నపేట,నవంబరు7 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కులాల ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ కోరారు.శుక్రవారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, పార్వతి, పైడిరాజు, కిషోర్ పాల్గొన్నారు

గురుకులంలో ఎంపీ కలిశెట్టి జన్మదిన వేడుకలు



విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

పూసపాటిరేగ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో పాతకొప్పెర్లలో గల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో శుక్రవారం రాత్రి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు జన్మదిన వేడుకలు జరిగాయి. తొలుత విద్యార్థులకు భోజనాలన వడ్డించారు. అనంతరం విద్యార్థులతో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికిఎదగాలని ఆకాంక్షించారు. గురుకుల పాఠశాల రాత్రికి బసచేశారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, సువ్వాడ రవిశేఖర్, పార్టీ మండలాధ్యక్షుడు మహంతి శంకరరావు, కర్రోతు సత్యన్నారాయణ, ఆకిరి ప్రసాదరావు, కోట్ల రఘు పాల్గొన్నారు.

తుఫాన్ నష్టంపై అంచనావేయండి

నెల్లిమర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎందుకు తరలించారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదాను ఎంపీపీ అంబళ్ల సుధారాణి, ఎమ్మెల్సీ సురేష్ బాబులు ప్రశ్నించారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి అధ్యక్షతన నెల్లిమర్ల మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. మొంథా తుఫాన్ వల్ల జరిగిన పంట నష్టం అంచనా వేసి న్యాయం చేయాలని అధికారులను కోరారు. గొర్లిపేటలో దేవస్థానం భూములకు ఈ-క్రాఫ్ చేయాలని సర్పంచ్ పరిశినాయుడు కోరారు.ఎల్ఎన్.పేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ప్రాథమిక పాఠశాలలోకి తరలించారని చంద్రంపేట సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ప్రశ్నించారు. సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గేదెల గాయత్రి, ఎంపీడీవో రామకృష్ణరాజు పాల్గొన్నారు.

రైతులు కోళ్ల పెంపకం చేపట్టాలి

జామి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఒకపక్క వ్యవసాయంతో పాటు మరో పక్క కోళ్లు,గొర్రెలు వంటివి పెంచితే ఆర్థికావృద్ధితో పాటు పంటల ఉత్పాదకత పెరుగుతుందని విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి వేడుకలను రైతులతో కలిపి రిలయన్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు పంటల్లో తీసుకోవాల్సిన పద్ధతులు వివరించారు.

మధ్యంతర భృతి మంజూరు చేయాలి

భోగాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పీఆర్సీని నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) మంజూరు చేయాలని భోగాపురం తాలూకా యూనిట్ ఏపీఎన్.ఈవో కార్యవర్గ సభ్యు లు డిమాండ్ చేశారు. భోగాపురంలో శుక్రవారం తాలూకా యూనెట్ కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. తాలూకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలన్నారు. వైద్యశాఖలో 143 జీవో రద్దుచేయాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ కోశాధికారి కె.చిన్నారావు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఉమాపతి పాల్గొన్నారు.

ఏడు మద్యం సీసాల స్వాధీనం

దత్తిరాజేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తి గ్రామంలో ఏడు మద్యం సీసాలు స్వాధీనంచేసుకుని పి.అప్పన్నపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు.దాడుల్లో ఎస్‌ఐలు పి.నరేంద్రకుమార్, పి.శాంతిలక్ష్మి, హెచ్‌సీలు ఎండీజే.భాషా, వీబీఎస్‌వీఆర్.రాజులు పాల్గొన్నారు.

తుప్పల్లోకి దూసుకెళ్లిన వ్యాన్

రేగిడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నశిర్లాం వద్ద పాలకొండ- రాజాం రహదారిమార్గంలో శుక్రవారం ఓ వ్యాన్ తుప్పల్లోకి దూసుకువెళ్లింది. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకొన్నారు. ఈ వ్యాన్‌ను యంత్రాలతో బయటకు తీశారు. ఆ సమయంలో టాఫిక్‌కు అంతరాయం కలిగింది.

గిరిజనుడిపై అడవి పంది దాడి

మెంటాడ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): లోతుగెడ్డ పంచాయతీ కొండలింగాలవలసకు చెందిన గిరిజనుడు కోటపర్తి మల్లన్నదొరపై అడవిపంది దాడి చేసింది.శుక్రవారం ఉదయం గరుగుపై పశువులకు గడ్డి వేస్తుండగా అడవి పంది కొండపైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో తారసపడి మల్లన్నదొరపై దాడిచేసింది. దీంతో గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు 108వాహనంలో గజపతినగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పింఛన్ల సొమ్ముతో డిజిటల్ అసిస్టెంట్ పరారీ

మెంటాడ,నవంబరు7(ఆంధ్రజ్యోతి):మండలంలోని జయతి గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ నెక్కలశ్రీను సుమారు 70 వేల రూపాయల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల డబ్బుతో పరారయ్యాడు. గ్రామంలో పింఛన్‌దారుల నుంచి వేలిముద్రలు తీసుకొని వెంటనే పింఛన్ డబ్బు ఇవ్వాల్సి ఉండగా, నగదు ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే ఇస్తానని, వేలిముద్రలు పడలేదని నమ్మబలికాడు.నాలుగురోజులుగాలబ్ధిదారులు ఎదురు చూస్తుండగా, ఈనెల ఐదో తేదీ నుంచి ఆయన విధులకు గైర్హాజరయ్యాడు.ఈ నేపథ్యంలో పంచాయతీకార్యదర్శి రాంబాబు ఎంపీడీవోకు ఫిర్యాదుచేశారు.కాగా డిజిటల్ అసిస్టెంట్ పింఛన్ సొమ్ముతో అవకతవకలకు పాల్పడినట్లు తెలిసిందని ఇన్‌చార్జి ఎంపీడీవో విమలకుమారి తెలిపారు. రెండు రోజులుగా విధులకు గైర్హాజరయ్యాడని చెప్పారు.ఈవిషయాన్ని డీఆర్‌డీఏ పీడీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

హెచ్‌సీ కుటుంబానికి ఆర్థిక సాయం

విజయనగరం క్రైమ్,నవంబరు7(ఆంధ్రజ్యోతి):పోలీస్ కంట్రోల్ రూములో హెచ్‌సీగా పనిచేసి ఇటీవలఅనారోగ్యంతో మృతిచెందిన నెస్ సత్యనారాయణ కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అండగా నిలిచారు.ఈమేరకు లక్షా 48వేలు చెక్కును ఎస్పీ దామోదర్ చేతులమీదుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సత్యనారాయణ భార్య త్రివేణికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రామకృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు: సీఐ

విజయనగరం క్రైమ్, నవంబరు7(ఆంధ్రజ్యోతి: నగరంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ టౌన్ సీఐ మన్మథరావు హెచ్చరించారు. నగరంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 24 మంది నిర్వాహకులను అదుపులోకి తీసుకుని మండల మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.మేజిస్ట్రేట్ ఒక్కక్కరికి రూ.2లక్షల పూచికత్తు బాండును ఇవ్వాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో పాతబెల్టుషాపు నిర్వాహకులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అయినా వారిలో మార్పురాకపోవడంతో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 24మందిపై కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్,సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజెండాలతో నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర వద్ద 141రోజులుగా జిందాల్ నుంచి తమ భూములు ఇప్పించాలని శాంతియుతంగా ఆందోళనచేస్తున్న నిర్వాసితులు శుక్రవారం రెవెన్యూ అధికారులతీరుపై నల్లజెండాలతో నిరసన తెలిపారు.ఈసందర్భంగా మాట్లాడుతూ న్యాయపరమైన కోర్కెలు తీర్చాలని నాలుగునెలలుగా నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. 18 ఏళ్లుగా తమను పట్టించుకోని జిందాల్ యాజమాన్యం కోసం రైతులతో పెదఖండేపల్లిలో రహస్య సమావేశాలు నిర్వహించి మభ్యపెట్టే విధంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు.



నల్లజెండాలతో నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

నేడు నేత్రవైద్య శిబిరం

రాజాం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బొద్దాం పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో లెఫ్టినెంట్ కల్నర్ కె.చరణ్ సారథ్యంలో శనివారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్ధేశ్వరి తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగంచేసుకోవాలి కోరారు.

10న వైద్య పరీక్షలు

గజపతినగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గలపిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాలు అందించేందుకు ఈనెల పదో తేదీన సమగ్రశిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎస్.విమలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ, బొండపల్లి మండలాలకు సంబందించి దివ్యాంగులకు అవసరమైన చేతికర్రలు, ట్రైసైకిల్, వీల్ చైర్లు అందించేందుకు వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

12న అప్రెంటీస్ మేళా

విజయనగరం దాసన్నపేట/రాజాం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) రాజాంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12వ తేదీన అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈఐడీ ప్యారీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంకిలి వారు 200 అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేసేందుకు మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు తమ ధ్రువపత్రాలను తీసుకొని హాజరుకావాలని సూచించారు.

కనీస పెన్షన్ అమలు చేయాలి

రాజాం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్‌దారులకు రూ.తొమ్మిది వేలు కనీస పెన్షన్ అమలు చేయాలని రాజాం నియోజకవర్గ పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈపీఎఫ్ నిల్వ నిధులను షేర్‌మార్కెట్లో పెట్టేందుకు ఉన్న పరిమితిని ఎత్తేయడం ఆపాలని డిమాండ్ చేశారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

నెల్లిమర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు ఈనెల పదో తేదీలోగా ఈ-క్రాప్ నమోదుచేసుకోవాలని ఏవో పి.శ్రీలక్ష్మి కోరారు.మొయిద నారాయణపట్నంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి

శృంగవరపుకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి: విశాఖలో డిసెంబరు 31 నుంచి వచ్చే ఏడాది జనవరి 4వరకు జరగనున్న సీఐటీయూ మహాసభలు విజయవంతంచేయాలని ఆ సంఘ జిల్లా కమిటీ సభ్యుడు చెలికాని ముత్యాలు కోరారు. శుక్రవారం శృంగవరపుకోటలో సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు.

బంగారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

దత్తిరాజేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):గడసాంలో బంగారమ్మతల్లి ఆలయంలో విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, బోడసింగి సత్తిబాబు, బెజవాడ బంగారునాయుడు, చెల్లూరి సత్యారావు, మజ్జి మహేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్కవరపుకోట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చందులూరు పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ పి.శ్రీరాములు తెలిపారు. అండర్- 13, 17, 19 విభాగాల్లో సింగంపల్లి సాయికుమార్, దుక్క సతీష్, ఎం.హేమంత్‌కుమార్, కిరణ్‌కుమార్ ఎంపికైనట్లు చెప్పారు. శనివారం నుంచి పదో తేదీ వరకూ విశాఖ బీచ్‌లో ఆక్వా కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం శివరామకృష్ణ, పీడీ అభినందించారు.

●దత్తిరాజేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): షికారుగంజి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు బి.చంద్రహాసిని, బి.రోహన్, ఎ.ఆదిత్యలు రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఈనెల 1న విజ్జి క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించారని చెప్పారు.

●మెరకముడిదాం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గర్భాం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రౌతు జాహ్నవి, పదో తరగతి చదువుతున్న మగవాపు చరణ్ అండర్ 19 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డీవీఎస్.అరుణకుమారి తెలిపారు.

కోర్టు భవనాలకు నిధుల మంజూరుకు కృషి

కొత్తవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస కోర్టు భవనానికి నిధులు మంజూరు కోసం కృషి చేస్తానని రాష్ట్ర బార్‌కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.కృష్ణమోహన్ తెలిపారు. శుక్రవారం కొత్తవలస న్యాయవాద సంఘం సభ్యులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదులకు సంబంధించి అందించే సహాయాన్ని ఇంతవరకు మంజూరు చేసే ఐదు లక్షల రూపాయలను తొమ్మిది లక్షల రూపాయలను పెంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షులు డీవీఎల్ దేవి, న్యాయవాదులు సీహెచ్ రామచంద్రప్రసాద్, నందిపల్లి శ్రీరామమూర్తి, కేహెచ్ రాజారావు, డి.శిప్రసాద్, కె అచ్చిబాబు, వైజీ నాయుడు, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెట్లను నరికేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణ పరిధిలో విశాఖ-అరకు రహదారి పక్కన గల తాటి చెట్లను నరికేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కల్లు గీత కార్మికులకు జీవనాధారం లేకుండ చేస్తున్నారని తెలిపారు. వాల్టాచట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని కోరారు.

పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాసరావు

నెల్లిమర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):విజయనగరం హెడ్ పోస్టాఫీసులో పనిచేస్తున్న శ్రీనివాసరావు హర్యానాలోని కురుక్షేత్రలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న 36వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఏపీ కబడ్డీ జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. శ్రీనివాసరావుకు 1997లో క్రీడా కోటాలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం లభించింది. క్రీడాకారుడిగా పలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జట్టు విజయంలో కీలక భూమిక పోషించారు. పలుమార్లు ఏపీ జట్టుకు కెప్టెన్‌గా ఉండి జట్టును విజయపదంలో నడిపించారు. శ్రీనివాసరావుని కోచ్‌గా నియమించడం పట్ల విజయనగరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమణారావు, సుందరనాయుడు, పోస్టుమాస్టర్ శాస్త్రి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి సూరిబాబు, కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

నగదు వసూళ్లపై విచారణ

గజపతినగరం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సిబ్బంది నుంచి మహాపోషన్ కార్యక్రమంతో పాటు కార్యాలయంలో మౌలిక వసతులకల్పనకు నగదు వసూళ్లపై వచ్చిన ఆరోపణలపై జిల్లా ప్రాజెక్టు అధికారి టి. విమలారాణి విచారణ చేపట్టారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోగల 213 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సిబ్బంది హాజరయ్యారు.గతనెల 16న మహాపోషణ్ కార్యక్రమంకోసం ప్రతిఅంగన్‌వాడీ నుంచి రూ.500 వసూళ్లు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరుకాకపోవడంతో తూతుమంత్రంగా కార్యక్రమం జరిగింది. మిగిలిన డబ్బులు ఇవ్వాలని కొంతమంది అంగన్‌వాడీలు సెక్టార్, ప్రాజెక్టు లీడర్లపై ఒత్తిడి తీసుకువచ్చారు.దీంతో రూ.155 ఖర్చులు పోను 345 అంగన్‌వాడీలకు లీడర్లు అందజేశారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల నుంచి నగదు వసూళ్లపై వచ్చిన కథనాలపై జిల్లా ప్రాజెక్టుఅధికారి లిఖితపూర్వకంగా వివరాలుతీసుకున్నారు. అంగన్‌వాడీల నుంచి వచ్చిన సమాధానాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. కార్యక్రమంలో పీవో రాజేశ్వరి పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్



మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

విజయనగరం క్రైమ్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. శుక్రవారం నగరంలోని బాబామెట్టలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠ శాలలో జాతీయ న్యాయసేవాసంస్థ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు, వ్యాసరచనపోటీలను నిర్వహించారు. బాలికలకు ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్‌పై వ్యాసరచనపోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానంచేశారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి

రాజాం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తరగతులకు సంబంధించిన పుస్తకాలతో పాటు ప్రముఖుల రచనలను కూడా చదవడం అలవాటు చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.శారదాంబ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీవిద్యానికేతన్, దినస్‌స్కూల్‌లో తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు జాతీయ న్యాయ సేవాదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక హక్కులు, విధులు, రాష్ట్ర విధాన నిర్దేశిక సూత్రాలపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బి.జోషిక, డి. వేదహర్షిత, బి.స్వప్న ప్రియ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవశం చేసుకున్నారు. విజేతలకు అబ్దుల్ కలాం, సుధామూర్తి రచనలను న్యాయాధికారి శారదాంబ అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి నైమిష, గట్టి పాపారావు, వై.భారతి పాల్గొన్నారు.

న్యాయసేవలను వినియోగించుకోవాలి

కొత్తవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : న్యాయ సేవలను అర్హులైన పేదలు వినియోగించుకోవలని కొత్తవలసకోర్టు న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయ్ చందర్ కోరారు. న్యాయ సేవాదినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కొత్తవలస న్యాయవాద సంఘం సభ్యులతో కలిసి మోటార్‌సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టుల్లో రాజీకి వీలుపడే కేసులను రాజీ చేసుకోవడం ద్వారా కాలాన్ని ఆదా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది ఎంవీఎస్ గిరిబాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్పు లేనట్టేనా?

(5వ పేజీ తరువాయి)

గరుగుబిల్లి మండలాలు పార్వతీపురం రెవిన్యూ డివిజన్‌లో ఉన్నాయి. అయితే ఒక అసెంబ్లీ స్థానంలో ఉన్న మండలాలన్నీ ఒకే రెవిన్యూ డివిజన్‌లో ఉండడం వల్ల ప్రజలకు ఇబ్బందులుండవని ఉపసంఘం అభిప్రాయపడింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని మండలాల్లో చేర్పులు,మార్పులు చోటు చేసుకోనున్నాయని తొలుత అంతా భావించారు. కానీ జీవోఎం (మంత్రుల ఉపసంఘం) పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు చేయనట్టు తెలిసింది.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

(5వ పేజీ తరువాయి)

కలెక్టరేట్‌కు వచ్చి వినతులు అందించాలని అప్పట్లో అధికారులు స్పష్టం చేశారు. దీంతో గత వైసీపీ ప్రభుత్వ కాలంలో గిరి జనులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రత్యేకంగా ఐటీడీఏలో గ్రీవెన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అప్పట్లో అధికారులకు గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు విన్నవిం చుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కాగా సుమారు నాలుగేళ్ల తర్వాత పార్వతీపురం ఐటీడీఏలో పీజీఆర్ఎస్ నిర్వహించడంపై గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త భవన నిర్మాణమెప్పుడో?

●పాఠశాలలో విద్యాశాఖ కార్యాలయ కార్యకలాపాలు



కూలేందుకు సిద్ధంగా ఉన్న మండల విద్యాశాఖ కార్యాలయం

మక్కువ రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరింది. భవనం బీటలు వారి వర్షాలకు కారిపోతోంది. లోపల స్లాబ్ పెల్చులూడిపడటంతో కార్యాలయాన్ని ఖాళీ చేశారు. ప్రస్తుతం స్థానిక ఎస్సీ కాలనీలో ఖాళీగా ఉన్న హెచ్‌సీ స్కూల్ భవనంలో మండల విద్యాశాఖ కార్యాలయం కొనసాగుతోంది. అయితే భవన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో విద్యాశాఖ అధికారులు, సిబ్బంది అవస్థలకు గురవుతున్నారు. ●ఈ విషయం సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజనీరు శ్రీకర్ వద్ద ప్రస్తావించడా రూ. 53 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మిస్తామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు.

ఘనంగా మృత్యుంజయ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాలకొండ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నక్కలపేటలోగల లలితా మహాత్రిపురసుందరి సమేత మృత్యుంజయ స్వామి ఆలయంలో శుక్రవారం మహా మృత్యుంజయ హోమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రహ, వాస్తుదోష నివారణ, మానసిక ప్రశాంతత కోసం పార్వతీపరమేశ్వరులకు పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు శరత్‌కుమార్, సహాయ అర్చకులు అనంత్, ఆకాష్ వేద మంత్రాల నడుమ హోమం జరిగింది.

పిల్లల భవిష్యత్‌కు సహకరించండి



ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం

జియ్యమ్మవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు సహకరించాలని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ఎన్ మూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, వారి ప్రగతికి తల్లిదండ్రులు ఏమి చేసి వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలనేది పూర్తిగా వివరించారు. అనంతరం రూ. 4. 50 లక్షలతో నిర్మించిన ఆర్‌వో ప్లాంటును హెచ్ఎం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహ చౌదరి, సోమేశ్వరరావు, విష్ణురాజు, చంద్రశేఖర్, డి.శంకరరావు, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

పాల ప్యాకెట్లను దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు



రికార్డులు తనిఖీ చేస్తున్న మేనేజర్

రామభద్రపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పాలను దుర్వినియోగం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ మేనేజర్ జే.రాకేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఉన్న పాల గోదాంను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లోనే పాలు వినియోగం చేయాలని, ఇతర మార్కెట్‌లకు పాలను వినియోగం చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతీనెలా 1 నుంచి 10లోగా ఈ కేంద్రాలకు పాల ప్యాకెట్లు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం గోదాములో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి పవన్‌కుమార్, స్థానిక గోదాం ఇన్‌చార్జి బండారు నాగరాజు పాల్గొన్నారు.

1972కు సమాచారం అందించాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు దృష్టికి వస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో మాదక ద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి డ్రైవర్లు తెలిసి చేసినా, తెలియక చేసిన శిక్షార్హులవుతారన్నారు. డ్రైవర్లు తమ బస్సుల్లో వెళ్లే బ్యాగులు, సంచులు ఇతర సామాగ్రిపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ మాధవ రెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రత నియమాలు పాటించక పోవడం వల్ల ఈ ఏడాది 80 మంది వరకు మృతి చెందారన్నారు. , 150 మంది క్షతగాత్రులు అయ్యారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మనీషా రెడ్డి, సబ్‌కలెక్టర్ వైశాలీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

●ఎస్పీ మాధవరెడ్డి



జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆకాంక్షించారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా విద్యార్థులు, పోలీసులక నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు శుక్రవారం బహుమతులను ఎస్పీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగం వల్ల నేడు అందరం సురరక్షితంగా జీవిస్తున్నామన్నారు. అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేసేందుకే పోలీసుల అమరవీరుల దినోత్సవాలు నిర్వహించామని చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతుల అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథయ, ద్వితీయ, తృతీయ స్థానాల వారికి వరుసగా రూ. 5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున అందజేశారు.

●జియ్యమ్మవలస: చినమేరంగి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మధుమతి చౌదరి జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో ప్రతిభ చాటింది. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా లైంగిక దాడుల నుంచి మహిళలను, పిల్లలను రక్షించడంలో విద్యార్థుల పాత్ర అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థిని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో శుక్రవారం ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా రూ. 5 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందు కున్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత

●బెలగాం: పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శుక్ర వారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి వినతులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగులకు వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి గ్రీవె న్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

బెలగాం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): చట్లాపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు అన్నారు. శుక్రవారం స్థానిక జీజే కళాశాలలో న్యాయసేవా దినోత్సవంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రాథమిక హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.వి.శైలజ, అధ్యాపకులు ఎ.రాజు, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మగూడలో అక్షరబ్రహ్మ పూజలు



అక్షర బ్రహ్మ ఆలయంలో డీఎస్పీ రాంబాబు

భామిని, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): సతివాడ సమీపంలోని నూకాలమ్మగూడలో శుక్రవారం అక్షరబ్రహ్మ ఆశ్రమంలో కార్తీకమాసం సందరంగా ఘనంగా పూజలు నిర్వహించారు. సవర లిపినే దేవతలుగా ఆదివాసీలు భావిస్తూ భాజాభజంత్రీలతో ఆశ్రమానికి వెళ్లారు. అక్షర బ్రహ్మ గురువు రాంప్రసాద్ గొమంగో ఆధ్వర్యంలో పూజలు, హోమాలు చేశారు. 21వ రోజు కర్తి దీక్ష చేసిన భక్తుల్లో పలువురు తలనీలాలు అర్పించారు. పార్వతీపురం జిల్లాతో పాటు ఒడిశా నుంచి భారీ సంఖ్యలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న తెలుసుకున్న డీఎస్పీ రాంబాబు బత్తిలి పోలీసులకు అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సవర కరువు, కామేశ్వరరావు, గంగరాపు అడైలకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అక్షర బ్రహ్మ ఆలయంలో డీఎస్పీ రాంబాబు పూజలు నిర్వహించారు.

గిరిజన రైతులకు శిక్షణ

సీతంపేట రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మన్యం సహజ ఉత్పత్తుల కంపెనీ, సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఆచార్య ఎన్‌జీ రంగా 125వ జయంతి సందర్భంగా శుక్రవారం రైతులకు కిరప గ్రామంలోని ఆర్ధ్ స్వచ్ఛంద సంస్థ శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. రబీ సీజన్‌లో పంట పొలాలను ఖాళీగా ఉంచకుండా అపరాలను సాగుచేయమని సైంటిస్ట్ పి.వెంకటరావు సూచించారు. శిక్షణలో సీఈవో శంకర్రావు, రస్తకుంటబాయి శాస్త్రవేత్తలు డా. ఎం.అనంత విహారి, ఎస్.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రైవేటీకరించవద్దు

పాలకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 22 ఏళ్లుగా విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నం ప్రభుత్వం విరమించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దు చేసి మండలానికి ఒక చోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్వహించేందుక విద్యాశాఖాధికారులు ప్రయత్నం చేయడం తగదన్నారు. ఈ విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే పోరాటాలు తప్పవన్నారు. సమా వేశంలో ఎస్.హిమప్రభ, అమరవేణి, చిన్నమ్మడు, గౌరి, దుర్గమ్మ, సావి త్రి, కరుణ, లక్ష్మి, దేవకి, హేమలత పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమిం చుకోవా లని జిల్లా సీఐటీయూ కార్యదర్శి బీవీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వా హకుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.మణికుమారి, పి.పావని, అన్నపూ ర్ణమ్మ, సూర్యం, డి.వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బాడంగి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ముగడ పంచాయతీలోని కంపోస్టు పిట్స్, భీమవరం పంచాయతీలోని మిని గోకులాల పనులను క్లస్టర్ ఏపీడీ చంద్రకుమారి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో రైతులకు ఉపయోగపడే పనులను చేయించాలన్నారు. ఆమె వెంట ఏపీవో సాయిరాం, జేఈ హరినారాయణ ఉన్నారు.

రిజర్వాయర్ పనులు పూర్తిచేయండి



ప్రభుత్వ విప్ జగదీశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్

జియ్యమ్మవలస/ గుమ్మలక్ష్మీపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జైకా నిధులతో వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరికి రిజర్వాయర్ వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ఆమె గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులకు రూ.44.85 కోట్ల జైకా నిధులు గతంలో మంజూరయ్యాయన్నారు. గతంలో అరకొరగా పనులు చేసి నిలిపి వేశారన్నారు. మిగిలిన పనులు పూర్తి చేయించాలని విప్‌ను కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే చినమేరంగిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు సదు పాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రసాద్ ఫిర్యాదు చేశారు. కార్య క్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏఎస్పీ

పార్వతీపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని పార్వతీపురం ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.మనీషారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

కురుపాం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాల నాయకులు రోబ్బా లోవ రాజు, ఇంటికుప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం పార్వతీపురంలో నిర్వహించిన ఐటీడీఏ పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కురుపాంలో సుమా రు 50 గిరిజన గ్రామాలలో గిరిజన రైతులు పత్తి సాగు చేస్తున్నారన్నా రు. ప్రభుత్వ పత్తి కొనుగోలు చేయకపోవడంతో దళారుల బారిన పడి త క్కువ ధరకు అమ్మి గిరిజన రైతులు మోసపోతున్నారని వివరించారు.

జనసేనలో పలువురి చేరిక



జనసేనలో చేరిన ఒబ్బంగి యువకులు

కురుపాం రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): ఒబ్బంగి పంచాయతీకి చెందిన పలువురు జనసేన పార్టీలో శుక్రవారం చేరారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నేరేడుబిల్లి వంశీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కద్రక మల్లేశ్వరరారావు చేరికలు జరిగాయి. వారందరికీ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

సీతంపేట రూరల్,నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికవేత్త కె.పార్వతీ కుమార్ 81వ జయంతి సందర్భంగా శుక్రవారం రామగిరి క్షేత్రంలో 270 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు వాల్మీకి వనవాసీ శ్రేయో సంస్థ అధ్యక్షుడు పెంటయ్య దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రామారావు, భాస్కరరావు, వెంకటేష్ ఉన్నారు.

అవగాహనతోనే వ్యాధులు దూరం

గరుగుబిల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు నివారణకు అవగాహనతోనే దూర మయ్యే అవకాశం ఉందని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాల రావు అన్నారు. శుక్రవారం రావివలస ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ కె.కార్తీక్, డాక్టర్ కీర్తిల ఆధ్వర్యంలో జాతీయ క్యా న్సర్ అవగాహన దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముం దస్తు పరీక్షలతోనే వ్యాధిని దూరం చేయవ చ్చునన్నారు. జీవన శైలిలో మార్పులు కార ణంగా దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయ న్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.గౌరీ శంకర్, కార్యదర్శి ఆర్.శశిభూషణ రావు, వైద్య సిబ్బంది సురేష్‌కుమార్, సర్పంచ్ బి.అప్పడు, ఈవో ప్రకాశరావు పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమన్యాయం

బొబ్బిలి రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): సోషలిజంతోనే సమ న్యా యం జరుగుతుందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం అన్నారు. ఎం. బూర్జవలసలో శుక్రవారం అక్టోబరు విప్లవంపై సమావేశం నిర్వహిం చారు. కార్యక్రమంలో నాయకుడు జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

పార్వతీపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శుక్రవారం మొదటిసారిగా రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశానికి హాజరైన కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డిని సొసైటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు డాక్టర్ ఎం.శ్రీరాములు, బి.జయప్రకాశ్‌నారాయణ, పి.కె.రావు, బి.ఎన్.బి.రావు, బి.రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు ఆరు వినతులు

సీతంపేట రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆరు వినతులు అందాయి ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ ఫిర్యాదులను స్వీకరించారు. పెద పల్లంకివలసలో అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గేదెల సుమలత కోరారు. వితంతు ఫించన్ ఇప్పించాలని గొర్లె సుజాత, సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఉద్యోగవకాశం కల్పించాలని గొర్లె రమేష్ పీవోను కోరారు. ఉద్యోగావకాశం కల్పించాలని కె.వీరఘట్టం గ్రామానికి చెందిన పి.రామారావు వినతిపత్రం అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోండి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి సూచించారు. శుక్రవారం స్థానిక ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్ నుంచి ఏరియా ఆసుపత్రి వరకు క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమన్నారు. ఎటువంటి అపోహాలు లేకుండా మహిళలు క్యాన్సర్ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మిశ్రో, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి మోహనరావు పాల్గొన్నారు.

●వీరఘట్టం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. కార్యకమంలో డాక్టర్ సాయి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు వైద్య పరీక్షలు

సీతంపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు ఏడో తరగతి విద్యార్థులు పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో ఐటీడీఏ అధి కారులు అప్రమత్తమయ్యారు. ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పాలకొండ, సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షల్లో ఎవరికి ఎటువంటి అనారోగ్య లక్షణాలు బయటపడలేదని ఆసుపత్రి సూపరిం టెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న ఇద్దరు విద్యార్థులు కూడా కోలుకుంటున్నారని పాఠశాల సిబ్బంది తెలిపారు.

300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

సీతంపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాడిపాయి సమీపం లోని కొండ ప్రాంతంలో శుక్రవారం దోనుబాయి ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో పోలీసులు సారా స్థావరంపై దాడులు నిర్వహించారు. సారా వంటకాలు, రవాణాకు వినియోగించే సామగ్రిని ధ్వంసం చేసినట్టు తెలిపారు. దాడుల్లో 10 లీటర్ల సారాతో శంకర్రావు పట్టుబడ్డాడన్నారు. అలాగే 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు.

40 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

కురుపాం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మూలిగూడ కూడలి శుక్రవారం నిర్వహించిన దాడుల్లో కాకితాడ గ్రామానికి చెందిన మీసాల సుధాకర్ 40 లీటర్ల సారాతో పట్టుబడ్డాడని ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. 40 లీటర్ల సారాతో పాటు బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భామిని, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): గురండి సబ్‌స్టేషన్ పరిధిలో శని వారం నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంట ల వరకు సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మనుమకొండ, పాలవలస, బత్తిలి, పక్కుడిభద్ర తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

తాగునీటి కోసం పెద్దింపేట మహిళల ఆందోళన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సీతానగరం (బలిజిపేట), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బలిజిపేట మండలంలోని పెద్దింపేట మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు రెడ్డి వేణు మాట్లాడుతూ తాగడానికి నీరు లేక ప్రజలు అల్లాడిపోతుండటంతో గత నెల 18న మండల పరిషత్ కార్యాలయం ఎదుట స్థానికులు ధర్నా నిర్వహించారన్నారు. ఎంపీడీవో, ఏవో, ఈవోపీఆర్‌డీ, పంచాయతీ సెక్రటరీలు అక్కడకు చేరుకుని వారం రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. గ్రామానికి చెందిన ఆయిల్‌పామ్ తోటలో రైతుతో మాట్లాడి అక్కడి నుంచి నీరు అందించే చర్యలు చేపడతామని, ట్యాంకు నిర్మించి తాగునీటిని అందిస్తామని అధికారులు చెప్పారన్నారు. రెండు వారాలు పూర్తయినా తాగునీటిని అందించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తక్షణమే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే పెద్దింపేట గ్రామస్థులతో చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యమ్మల మన్మథరావు, వెన్నెల కృష్ణ, బంతిని, గౌరీశ్వరరావు, మజ్జి దుర్గారావు, రాములమ్మ, సీతారావమ్మ, లక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.